క్లుప్తంగా

అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో అంబలి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియా, సభ్యులు పుల్లూరి శంకర్, భీమ్‌రావు, కాంగ్రెస్ నాయకులు మసాదే చరణ్, బస్వన్, జమీర్, సాయి, ప్రమోద్ పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణ ప్రారంభం

రెబ్బెన: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ పక్కన ఖాళీస్థలంలో శనివారం వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రారంభించినట్లు మాస్టర్ చాపిడి కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. డ్రాగన్స్ కుంగ్‌ఫూ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఈ శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. బ్యాక్‌జంప్, స్ట్రైక్, మూమెంట్, కటా విభాగం, సారింగ్ మూమెంట్‌లో జూన్ 12 వరకు శిక్షణ కొనసాగుతుందని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షాపులు తొలగించాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీలు

కౌటాల: కౌటాల కుమురం భీం కమిటీ హాల్ ఎదుట గల షాపులను తొలగించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతకొన్నేళ్లుగా గిరిజనేతరులు కమిటీ హాల్ ఎదుట షాపులు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. హాల్ స్థలంలో ఉన్న వాటిని తొలగించాలన్నారు. ఐటీడీఏ డైరెక్టర్ కుమురం మాంతయ్య, కొలావార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్యతోపాటు తలండి లక్ష్మణ్, డబ్బా బాపు, సిడం అశోక్, సుకారాం, సురేష్, తిరుపతి, కోటేశ్వర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా యూడైస్ సర్వే చేపట్టాలి



ధనోరాలో సర్వే రిపోర్టును హెచ్‌ఎంకు అందిస్తున్న ఎంఈవో

కెరమెరి: యూడైస్ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని సావర్‌ఖెడా పీఎం శ్రీ పాఠశాలతోపాటు ధనోరా ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. ఈనెల 15 నుంచి ప్రారంభమైన సర్వే మండలంలోని ఎంపిక చేసిన 46 పాఠశాలల్లో కొనసాగుతోంది. స్కూల్ రిపోర్టు కార్డు ఆధారంగా ఉన్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తప్పొప్పులు ఉంటే వెంటనే మార్క్ చేసి యూడైస్ పోర్టల్ సరిచేయాలన్నారు. సోమవారం ప్రక్రియ ముగియాలన్నారు. హెచ్‌ఎం రంగయ్య, టీచర్ రజిత, సీఆర్పీ ఫయాజ్ ఉర్ రహ్మాన్, డీఎడ్ ట్రైనీ శృతి ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

కౌటాల: కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో మండలంలోని కన్నెపల్లిలో పశువులకు శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ముత్తంపేట పశువైద్యాధికారి కె.అంజలి మాట్లాడుతూ పశువులకు టీకాలు తప్పకుండా వేయాలన్నారు. అన్ని గ్రామాల్లో నెలరోజుల పాటు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయుడు సాయినాథ్ అన్నారు. మండలంలోని గురుడుపేటలో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ విద్యపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతోపాటు ఉచితంగా పుస్తకాలు అందిస్తామన్నారు.

దూరభారం..తప్పని ఇక్కట్లు

కొన్నిరోజులుగా మండల నాయకులు ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. కాని అవసరమైన చాలా ప్రాంతాల్లో రోడ్లు వేయాల్సి ఉన్నాయి. అందులో ఇంద్రానగర్, అంతాపూర్ గ్రామాల నుంచి బోరాలాల్‌గూడ మీదుగా అనార్‌పల్లి వరకు లింక్ రోడ్డు నిర్మిస్తే దూరభారం తగ్గుతుంది. దీంతో కెరమెరికి చేరుకోవడానికి సగం దూరం తగ్గే అవకాశం ఉంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



లేండిగూడ మీదుగా కెరమెరికి వచ్చే మహారాష్ట్ర సర్కారు నిర్మించిన తారురోడ్డు



బోరిలాల్‌గూడ నుంచి అంతాపూర్‌కు వెళ్లే రోడ్డు

- ఇంద్రానగర్, అంతాపూర్ గ్రామాలకు రోడ్లు కరువు
- కెరమెరి చేరుకోవాలంటే 25 కి.మీ వెళ్లాల్సిందే
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కెరమెరి: మండలంలోని తెలంగాణ–మహారాష్ట్ర పరిధిలోని సరిహద్దు గ్రామాలు ఇంద్రానగర్, అంతాపూర్ వాసులకు ప్రయాణం నరకంగా మారింది. ఎన్నో ఏళ్లనుంచి బీటీ లేదా సీసీ రోడ్డు వేయాలని అధికారులు, నాయకులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ప్రయాణానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ రెండు గ్రామాలు అంతాపూర్ పంచాయతీలో ఉన్నాయి. అక్కడ 140 కుటుంబాలు ఉండగా.. 723 జనాభా ఉంది. కాని సులువైన రవాణా సౌకర్యం లేకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

లేండిగూడ మీదుగా ఇంద్రానగర్

ప్రస్తుతం ఆ గ్రామాల ప్రజలు కెరమెరికి చేరుకోవాలంటే నారాయణగూడ, భోలాపటార్, లేండిగూడ, సాంగ్వి గ్రామాల మీదుగా రావల్సి ఉంది. ఇందుకు 25 కి.మీ దూరం పడుతుంది. మహారాష్ట్ర ప్రభుత్వం భోలాపటార్ నుంచి ఇంద్రానగర్‌కు తారురోడ్డు నిర్మించింది. అదే బోరిలాల్‌గూడ, అనార్‌పల్లి మీదుగా కెరమెరికి చేరాలంటే కేవలం 13 కి.మీ దూరం పడుతుంది. అయితే ఇంద్రానగర్ నుంచి బోరిలాల్‌గూడ వరకు కేవలం 1.5 కి.మీ దూరం మాత్రమే ఉంది. ఇది పూర్తిగా దిగువ ప్రాంతం ఉండడంతోపాటు రాళ్లురప్పలతో నిండి నడిచేందుకు యోగ్యంగా లేదు. ఆయా గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులు, కూరగాయల కొనుగోలు, కార్యాలయాల్లో ఏదైన పని ఉండడం వల్ల ప్రతీరోజు కెరమెరికి రాకపోకలు సాగుతున్నారు.

ప్రభుత్వంపై ఆశలు

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో ఉన్న ఎమ్మెల్యే, ఇతర అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ఎన్నో హామీలు ఇస్తున్న ప్రభుత్వం మా గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. ఇటీవల అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేపడుతున్నప్పటికి మాపైచిన్నచూపు చూస్తున్నారని మండిపడుతున్నారు.

రోడ్డు నిర్మించాలి



మేమంతా కెరమెరికి చేరుకోవాలంటే లేండిగూడ మీదుగా 25 కి.మీ దూరంలో వెళ్తున్నాం. అదే బోరిలాల్‌గూడ వరకు 1.5 కి.మీ రోడ్డు నిర్మిస్తే దూరభారం చాలా వరకు తగ్గుతుంది. అధికారులు స్పందించాలి.

– బాజిరావు, ఇంద్రానగర్

నివేదిస్తాం



ఆయా గ్రామాల ప్రజలకు రోడ్డు కోసం తీర్మానం పంపిస్తే జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తాం. ఉన్నతాధికారుల నుంచి మంజూరు కాగానే రోడ్డు పనులు ప్రారంభిస్తాం. అప్పటివరకు ప్రస్తుతం చేస్తున్న దారిలోనే ప్రయాణం చేయాలి.

– అంజద్‌పాషా, ఎంపీడీవో

కాని ప్రజాప్రతినిధుల్లో మాత్రం 1.5 కి.మీ రోడ్డు నిర్మాణం చేపడుదామన్నా చిత్తశుద్ధి లేకపోవడంతో ప్రయాణ కష్టాలు తీరడం లేదు.

తారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా దహెగాం మార్కెట్ ప్రాంతం

దహెగాం: రెండు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. జిల్లాలో 41 నుంచి 42 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు ఎండ వేడిమి కి అల్లాడుతున్నారు. ఉదయం 10 గంటలు దాటితే బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. తప్పనిసరి అవసరాల కోసం బయటకు వచ్చేవారు ఉదయం 10 గంటల లోపే పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్తున్నారు. నెత్తికి రుమాలు చుట్టుకుని, మహిళలు స్కార్ఫ్ కట్టుకుని వస్తున్నారు. సాయంత్రం 5గంటలు దాటినా ఎండ వేడి తగ్గడం లేదు. జనం ఇళ్లకే పరి మితమై కూలర్ల వద్ద సేద తీరుతున్నారు. కరెంట్ కూడా ఇబ్బంది పెడుతోందని పలువురు వాపోతున్నారు. పల్లెల్లోనైతే చెట్ల కింద సేదతీరుతున్నారు. ఇంకా నెలపాటు ఈ పరిస్థితి తప్పేలా లేదని వాపోతున్నారు.



ఎండ వేడికి నెత్తిన రుమాల్‌తో..



స్కార్ఫ్ కట్టుకున్న మహిళ

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కాగజ్‌నగర్‌రూరల్: భీమిని మండలం చిన్నగుడిపేట లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. శనివారం కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు నివాసంలో వారికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆయన వెంట నాయకులున్నారు.



చెక్కులు అందిజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

ఖేడేగాంలో పోషణ్ పక్వాడ

వాంకిడి: మండలంలోని ఖేడేగాం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ తౌఫిక్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు ప్రదర్శించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణి మొదటి నుంచి బిడ్డకు రెండేళ్లు నిండే వరకు వెయ్యి రోజుల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలను వివరించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ డోంగ్రి ప్రవీణ్ కుమార్, అంగన్‌వాడీలు ఇందిరా, రాజ్‌కుమారి, వీణ, రత్నమాల, ఉమ, విజయలక్ష్మి, ఏఎన్‌ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలు ప్రదర్శిస్తున్న సిబ్బంది

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

పెంచికల్‌పేట్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అన్నారు. శనివారం పెంచికల్‌పేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇంటరాక్షన్ ఆఫ్ గర్ల్స్ స్టూడెంట్స్ విత్ రోల్ మోడల్ విత్ హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేశారు. బాలికలకు చట్టాలు, ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం, హెచ్‌ఎం విజయ నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

లింగాపూర్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. సిర్పూర్(యు) మండలం కోహినూర్ గ్రామంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు చట్టాలు, సైబర్ నేరాలపై పోలీసుల ఆధ్వర్యంలో కళా బృందంతో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. బాగా చదివి ప్రయోజకులు కావాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాలతోనే అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, కళా బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, రజిత, శ్రీనివాస్‌తోపాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళా బృందం

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలి

కౌటాల: నాణ్యత ప్రమాణాలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని నాగేపల్లి పంచాయతీ కార్యాలయంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పునాది వరకు పని చేసిన లబ్ధిదారులకు రూ. లక్ష నగదు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. నిర్మాణ పనులను సంబంధిత అధికారులు పరిశీలించాలన్నారు. సమావేశంలో కార్యదర్శి సంధ్య, తదితరులు ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రసాద్

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కౌటాల: మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల కన్వీనర్ నికాడే గంగారాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు కోసం రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయని, నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ మారుతి, నాయకులు రుషి, ఉద్ధవ్, గోవింద్‌రావు, భూషణ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న నాయకులు

రోడ్లను కమ్మేస్తున్న తుమ్మచెట్లు



ఖమాన నుంచి సర్కేపల్లి వెళ్లే రోడ్డు



నార్లపూర్ వెళ్లే రోడ్డు



ఎస్సీ, బీసీ హాస్టల్ ముందు

వాంకిడికి చెందిన ఇద్దరు నెలక్రితం ఓ పని నిమిత్తం జంబుల్‌ధరి గ్రామానికి వెళ్లారు. సాయంత్రం సమయంలో పని ముగించుకుని తిరిగి బైక్‌పై వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. రోడ్డును ఆక్రమించి తుమ్మచెట్లు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొంది. ఒకరి కాలు విరిగిపోగా, పలువురికి గాయాలయ్యాయి.

- ఏపుగా పెరిగి ఆక్రమిస్తున్న రోడ్లు
- ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు
- అధికారులు పట్టించుకోవాలంటున్న వాహనదారులు

వాంకిడి: మండలంలోని గ్రామీణ రహదారుల గుండా తుమ్మచెట్లు ఏపుగా పెరిగిపోతున్నాయి. దీంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. కొన్నిచోట్ల చెట్లు, పొదలు రోడ్లను ఆక్రమిస్తున్నాయి. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను పొదలు కమ్మేయడంతో ఎదుగుదల లేకుండా పోతున్నాయి. మరికొన్నిచోట్ల రెండు వాహనాలు పొదలు ఉన్న ప్రాంతాల్లో ఒకేసారి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు, కంకర తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. దానికి తోడు తుమ్మచెట్లు ఏపుగా పెరిగి ఉన్నాయి. నవేధరి, కనర్‌గాం, ఖమాన, సర్కేపల్లి, సరాండి, లంజన్వీర, జంబులధరి తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు తుమ్మ చెట్లతో కమ్మేసి ఉన్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు, ఎడ్లబండ్లు, పాదచారులను గుర్తించలేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని వెంటనే తుమ్మచెట్లను తొలగించాలని కోరుతున్నారు.



నవేధరి వెళ్లే రోడ్డు వద్ద..

తుమ్మచెట్లు తొలగించాలి

రోడ్లగుండా ఉన్న తుమ్మచెట్లు, పొదలు పెరిగి ఉన్నాయి. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు పట్టించుకుని తుమ్మచెట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలి.

– జాగిరి సతీశ్, వాంకిడి

భయంగా ఉంది

ఖమాన నుంచి సర్కేపల్లి వెళ్లే రహదారి గుండా తుమ్మ చెట్లు ఏపుగా పెరిగి రోడ్లపై విస్తరిస్తున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు, ఎడ్లబండ్లను గుర్తించలేక పోతున్నాం. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది.

– జాడి మనోహర్, ఖమాన

చర్యలు తీసుకుంటాం


రోడ్ల గుండా తుమ్మ చెట్లు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి రహదారుల పరిస్థితులపై వివరాలు తీసుకుని చర్యలు చేపడుతాం.

– ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో, వాంకిడి

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్

ఆసిఫాబాద్ రూరల్: 'రైతులకు కరెంట్ కష్టాలు' శీర్షికన సాక్షిలో శనివా రం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. నూ తన ట్రాన్స్‌ఫార్మర్ ఏ ర్పాటు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పా టు, లూజ్‌వైర్లు సరిచేసి సమస్య లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అనాథ పిల్లలకు ఆర్థికసాయం

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలం రాఘాపూర్ గ్రామానికి చెందిన సోయం మంతు రెండురోజుల క్రితం ఉపాధి పని చేస్తుండగా వడదెబ్బతో మృతిచెందాడు. పెద్ద దిక్కు అయిన తండ్రి మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న హేడ్ సొసైటీ చైర్మన్ జాదవ్ శ్రీకాంత్–ఉష దంపతులు ఆ గ్రామానికి వెళ్లి అనాథ పిల్లలకు సొసైటీ తరపున రూ.5వేల ఆర్థికసాయం అందించారు. హ్యూమన్స్ రైట్స్ సభ్యుడు ఆత్రం రాము, సుధాం, మాజీ సర్పంచ్ నాందేవ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న జాదవ్ శ్రీకాంత్

అదనపు కట్నం కేసులో ముగ్గురి రిమాండ్

దహెగాం: అదనపు కట్నం వేధింపుల కేసులో భర్త, అత్తమామలు ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కందూరి రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని కోత్మీర్ గ్రామానికి చెందిన బొలిశెట్టి వెంకటేశ్‌కు కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లికి చెందిన జ్యోతితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. అదనపు కట్నం తేవాలని భర్త వెంకటేశ్, అత్త భాగ్య, మామ మొండయ్యలు జ్యోతిని వేధించసాగారు. ఈనెల 16న మరో సారి వేధించడంతోపాటు ఇంట్లో ఉన్న గడ్డి మందు తీసుకువచ్చి జ్యోతికి బలవంతంగా తాగించినట్లు తమ విచారణలో తేలింది. జ్యోతి తల్లి పెర్క సుశీల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ అనంతరం శనివారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై వివరించారు. జ్యోతి ప్రస్తుతం కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.